# ఆంధ్ర ప్రదేశ్ ఆహార ధాన్యోత్పత్తిదార్ల మహాసభ

## విజయవాడ



ఆచార్య రంగాగారి
ప్రారంభోపన్యాసం

★ ★ ★

దండమూడి దశరధరామయ్యగారి
ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసం

**తే. 21-11-58**

# ఆచార్య రంగాగారి ప్రారంభోపన్యాసం

"మనదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గరిష్ఠ స్థాయికి పెంచవలెనంటే, విదేశధాన్యాల దిగుమతులు కనిష్ఠ పరిమాణానికి, తగ్గించాలీ అంటే, ప్రభుత్వం ధాన్యం ఉత్పత్తి దారులపట్ల చూపుతూ ఉన్న అనుమానాలను, సందేహాలను విద్వేషభావాలను, ప్రతికూల భావాలను విసర్జించాలి. కర్ష కులపట్ల సానుభూతిని వారి శక్తి సామర్థ్యములయందు, దేశ భక్తియందు, పరిపూర్ణ విశ్వాసాన్ని చూపాలి. ప్రభుత్వం భావాలలోను, ప్రవర్తనలోను అటువంటి మార్పు వచ్చిన నాడు వ్యావసాయక రంగంలో అత్యద్భుతమైన నూతనోత్సాహం తాండవిస్తుంది. ఆహారోత్పత్తి మిన్నుముట్టుతుంది.

ఆహారోత్పత్తి విషయంలో ప్రభుత్వంవారి ప్రవర్తన అధ్వాన్నముగా నున్నది. ఇది దేశం దురదృష్టం. రైతుల దురదృష్టం. అహారోత్పత్తిని పెంచే విధానాలను సూచించే నిమిత్తం, ప్రభుత్వం పరంపరలుగా సంఘాలను నియమించింది. ఆ సంఘాలన్నీ ఏకగ్రీవంగా, ముక్త కంఠంతో ఆహార ధాన్యాలకు, ముఖ్యంగా బియ్యానికి, గోధుమలకు గిట్టుబాటైన కనిష్ట ధరలు నిర్ణయించవలెననీ, అట్లు నిర్ణయించబడిన ధరల పథకాన్ని సక్రమంగా అమలు జరుపవలెననీ, సిఫార్సు చేసినాయి. కాని ప్రభుత్వం ఈ సిఫార్సులను అమలు జరుపలేదు. ఈ నిరాదరణకూ, ఉపేక్షకూ, కారణమేమనవలెను? రైతుల ఋజుప్రవర్తనపట్ల ప్రభుత్వానికిగల అవిశ్వాసమా? పై సంఘాలు చేసిన సిఫార్సులు ఆచరణ యోగ్యములే వనియా? వివేకవంతములు కావనియా? ఆ మాటయైనను చెప్పవచ్చునుగదా?

వ్యవసాయం పట్ల, వ్యవసాయదార్ల పట్ల ఈ ప్రకారంగా సవతితల్లి ప్రేమతో ప్రవర్తించిన ప్రభుత్వం పరిశ్రమల పట్లను, పారిశ్రామిక కార్మికుల పట్లను ప్రవర్తించిన చందము, అవలంబించిన వైఖరి, వేరుగా ఉన్నాయి. పరిశ్రమలలో ఉత్పత్తి పెరగాలీ అంటే పనివాండ్రకు, యజమానులకూ కూడా ప్రోత్సాహకరమయి, ప్రలోభకరములగు ఆకర్షణలు కల్పించాలీ అన్న సిద్ధాంతాన్ని ప్రభుత్వం అంగీకరించింది. కాని అదే సిద్ధాంతం రైతులకు కూడా వర్తిస్తుందన్న విషయాన్ని మాత్రం ప్రభుత్వం అంగీకరించటం లేదు. ఇది విద్వేషానికి, అనుమానానికి, అవిశ్వాసానికి సూచన గాక మరేమవుతుంది? మీరే ఆలోచించండి! భారత దేశంలో ఉన్న మొత్తం శ్రమజీవుల్లో సగానికంటె ఎక్కువమంది కర్షకులు. ఇట్టి ప్రబల సంఖ్యాకులగు కర్షకులపట్ల ఇట్టి నిరాదరణ చూపటం ప్రభుత్వానికి శ్రేయస్కరముగాదు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత లోగడ కాలంలోనే ప్రభుత్వం జీతాల సంఘాన్ని (Pay Commission) నియమించింది. ఆ సంఘం వారు చేసిన సిఫార్సు లన్నింటినీ వెంటనే ఆచరణలో పెట్టింది. కార్మికుల జీతాలు పెంచింది. అలవెన్సులు హెచ్చించింది. కర్మాగారాల్లో సౌకర్యాలు, సంరక్షణలు శుభ్రత మొదలగు సన్నివేశ స్థితిగతుల బాగుపరిచారు. జీతాలు, అలవెన్సులు ఎంతవరకు పెంచవలెనా అన్న విషయం ఆయా పరిశ్రమలకు లభిస్తున్న లాభాలను పట్టి నిర్ణయమవుతుంది. అది లోతుగా విచారిస్తేగాని తేలదు, విచారణకు కొంతకాలం పడుతుంది. అంతవరకు ఆకలిగొని వున్న కార్మికులు ఆగలేరని గ్రహించి ప్రభుత్వం ఆయా కార్మికవర్గముల వారికి కొత్త జీతాల

పథకము సిద్ధమగువరకు తాత్కాలిక బాధాశమనము నిమిత్తము సహాయ వేతనాలు యిచ్చింది. ఈ చర్య చాలా సమంజసంగా ఉన్నదని నేను హర్షిస్తున్నాను. ఇందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. కాని, కోరేదేమిటంటే, ప్రభుత్వం ఇటువంటి సానుభూతినే, విజ్ఞాన సంపత్తినే కర్షకులపట్ల కూడా చూపమని కోరుతున్నాను.

అశోక మెహతా సంఘం ఆహారోత్పత్తి వృత్తి వృద్ధిపొందాలంటే ప్రభుత్వం ఏయే విధానాలు అవలంభించాలో, ఏయే కార్యక్రమాలు ఆచరించాలో విస్పష్టంగా చెప్పింది. రైతులకు గిట్టుబాటు ధరలను నిర్ణయించవలెననియు ఆధరల పథకాన్ని అమలు జరుపుటకు ఒక సంస్థను నెలకొల్పవలయుననియు, ఆ సంఘం సిఫార్సు చేసింది. ఇది ఆహారోత్పత్తికి సంబంధించిన వ్యవహారములలో గురుతరమైన ప్రాముఖ్యతగల సిఫార్సు. దీన్ని ప్రభుత్వం చల్లగా జారవిడిచింది. ప్రభుత్వం రైతులమీద శీతకన్ను వేసిందనటానికి యింతకంటె ప్రబల నిదర్శనం ఏమి కావాలి ? కార్మికులపట్ల, కర్షకులపట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ విభిన్న వైఖులను పరామర్శించి చూచినవారికి ప్రభుత్వం ప్రవర్తన పక్షపాత పూరితమైనట్లు ప్రభుత్వం కర్షకులపట్ల విద్వేషాన్ని చూపుచున్న దనుటకు ఇది ఒక నిదర్శనంగా స్పష్టమౌతుంది. ప్రభుత్వం కార్మికులపట్ల అవలంభించిన వైఖరిని కర్షకులపట్ల కూడా అవలంభించమని అర్థిస్తున్నాను.

వ్యవసాయపు ఆస్తులకు గరిష్ట ప్రమాణం నిర్ణయించమని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను నొక్కి-నొక్కి నలగ ద్రొక్కుచున్న—. ప్రభుత్వపు ఉద్యోగస్థుల జీతా

లకు, పట్టణాలలో నివసించేవారి ఆదాయములకు, పరిశ్రమల యజమానుల ఆదాయములకు, వాణిజ్య ప్రవర్తకుల ఆదాయములకు, విద్యా బద్ధవృత్తులలో లభించే ఆదాయములకుకూడ గరిష్ట ప్రమాణాలను నిర్ణయించమని మనం చేసే అభ్యర్ధనల నన్నింటిని ప్రభుత్వం పెడచెవిని పెడుతుంది. ఇది ప్రభుత్వం కర్షకులపట్ల చూపే ప్రతికూల భావానికి, పక్షపాతం బుద్ధికి రెండవ నిదర్శనం.

కర్షక సోదరులారా! ఈ సందర్భంలో మీకొక జాగ్రత్తను హెచ్చరించవలసి యున్నది. నేటి రాజకీయ రంగంలో కొందరు స్వార్ధపరులగు వ్యక్తులు, కర్షకులకు వ్యతిరేకముగా ఒక దుష్ట ప్రచారాన్ని చేస్తున్నారు, కర్షకులు స్వార్థపరులని, ధన తృష్ణాపీడితులని ధాన్యాలకు అంతులేని ధర కోరుతున్నారని పట్టణాలలోను, పల్లెలలోను నివసించే భూమిలేని ప్రజజను దోచుకుతినాలని ప్రయత్నిస్తున్నారని వారు ప్రచారం చేస్తున్నారు. ఇది అసత్య ప్రచారం. నేను సర్వజనుల కల్యాణాన్ని సౌఖ్యాన్ని కోరేవాడను. ధాన్యాల ధరను ఒకసారి పెంచిన తరువాత మరల మరల పెంచమని కర్షకులు కోరుతున్నారు. ఇది అన్యాయము, అత్యాశ స్వార్థ పరత్వం అని మన ప్రతి పక్షీయులు నిందిస్తున్నారు. నేను వారికి చెప్పే సమాధానం ఒకటే. సకల విధములైన ఆర్థిక రంగములలోను కృషిచేసే వ్యక్తులు తమ తమ ఆదాయము లను పెంచమని పదే పదే అడుగుతున్నారు. దీనికి కారణాలు రెండు. జీవితమునకు ఆవశ్యములగు వస్తువుల ధరలు పెరగడం ఒక కారణం. దేశముయొక్క ఆర్థిక సౌష్ఠవం వృద్ధి పొందుటవలన జీవన ప్రమాణాన్ని పెంచుకోవాలి అని వృ...

సహజమైన కోరిక రెండవ కారణం. ఇది సర్వజనసామాన్య మైన ప్రవర్తనయే గాని, ప్రత్యేకంగా కర్షకులే అవలంభించిన ప్రవర్తనగాదు.

సకల పదార్థాలకు ధరలు హెచ్చుతగ్గులు లేకుండా స్థిరంగా ఉండాలని కోరేవారిలో కర్షకులు మొదటి వారని నేను ఘంటాపథంగా చెపుతాను. రైతుకు ముట్టే ధరకూ ధాన్యం వినియోగదార్లు యిచ్చే ధరకు మధ్య తేడా సాధ్య మైనంత తక్కువగా ఉండాలని రైతు కోరిక. రైతు కోరేది గౌరవనీయమైన దైన్యత్వరహితమైన, ఒడుదుడుకులు లేని, భయసంభ్రమాలు లేనటువంటి జీవితం. అతనికి పెద్దలాభాలు అక్కరలేదు. ధనరాసులు సమకూర్చి కోటికి పడిగ ఎత్తాలన్న ఆదర్శాలుగాని, ఆశయాలుగాని అతనికి లేవు. ధన తృష్ణ అతనికి లేదు. ధనార్జనే జీవిత విన్యాసంగా అతను భావించటంలేదు. దేశంలో వున్న ధాన్యాన్ని అంతటిని ఆకట్టి ధరలను తన చిత్తము వచ్చినట్లుగా ఆడించటం అతని పనిగాదు. కోరికా గాదు. అట్టి పాపానికి రైతు ఒడిగట్టడు. రైతు ధాన్యం నిల్వచేసే దాని అంతరార్థం ధరను పెంచాలని గాదు. కొత్త ధాన్యం వచ్చేదాకా పాతధాన్యం కొంత ఉండాలి. భూమిలో పెరుగుతూ ఉన్నపైరు ఈతిబాధలవల్ల ఎంత పోతుందో ఎంత ఉంటుందో తెలియదుగదా ? అనే భావనే అతని హృదయంలో ఉంటుంది.

రైతులు ధరలు నిర్ణీకృతంగాను, స్థిరీకృతంగాను ఉండాలని కోరుతున్నారు. ధరలు పడటం, లేవటంవల్ల వచ్చే బాధనుంచి విముక్తులు కావాలని కోరుతున్నారు. ప్రభుత్వానికి మిత్రులుగాను సహకారులుగాను ఉండాలని కోరుతు

న్నారు. ప్రజాక్షేమానికి శక్తాను సారంగా పాటుపడాలని కోరుతున్నారు. రైతులు సకల ప్రజానురాగానికి తాము పాత్రులము కావాలని కోరుతున్నారు గాని వారి రక్తాన్ని పీల్చవలెనని కోరుటలేదు. రైతులు వ్యాపారస్థులకువలె ప్రతి రోజు వార్తాపత్రికలను దగ్గర పెట్టుకొని ఏ దేశం పండింది. ఏ దేశం ఎండింది ఏటోకు వ్యాపారస్థుడు ధాన్యాన్ని ఎంతనిల్వ చేశాడు ? ధర ఎంత ఉండవచ్చు అనే విషయాలను గూర్చి రాత్రింబవళ్లు ఆలోచించలేరు. వారికా తీరికా లేదు, రుచీ లేదు. తమ కృషిలో నిమగ్నులై పంటపండిస్తారు. పంటను అమ్ముకోదలచి నప్పుడు తక్షణమే అమ్ముకోవటానికి వారికి వసతులు ఉండాలి. ధాన్యం ఒకయేడు జనవరిలో అమ్మితే లాభం, మరొకయేడు నష్టం, అనే పరిస్థితులతో రైతులు పోరాడజాలరు. కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవటములో కూడా జూదమాడవలసివస్తే రైతు నలిగి పోతాడు. ఈతి బాధలు అనే జాడ్యంతోనే అతను నలిగి పోతున్నాడు. దానికి ధరల జూదంతోడితే అతని గతి అధోగత అవుతుంది.

## సాంఘిక శ్రేయో సంఘం

ధరల హెచ్చుతగ్గులవల్ల కలిగే బాధ, వ్యాపారస్థుల వల్ల కలిగే బాధ ఈ రెండు బాధలను నివర్తించగల ఒక సంస్థను సృష్టించాలి. దీనికి, 'సాంఘిక శ్రేయో సంఘం" అని గాని, అటువంటి అర్థాన్ని స్ఫురింపజేసే మరొక పేరు గాని పెట్టవచ్చు. ఈ సంస్థ మీద రైతులకు కంట్రోలు ఉండాలి. ఇది సహకార సంఘాల ననుసరించి పని చేయ్యాలి.

ధాన్యపు వినియోగదార్ల నుండి లభించే ధర సహాకార సూత్రాల ప్రకారం ఉత్పత్తిదారులకు ముట్టే విధానాన్ని ఈ సంస్థ ఆచరణలో పెట్టాలి. ఈ సంస్థ లాభాలకోసం ప్రయత్నించకూడదు. నష్టాలను పొందకూడదు.

ఆహార వినియోగదారులలో పేదసద్ద తరగతులకు ప్రభుత్వం చవక ధాన్యాన్ని సరఫరా చెయ్యవలెనన్న సిద్ధాంతాన్ని నేను అంగీకరిస్తున్నాను. కానీ అ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టే విషయంలో ప్రభుత్వాభిప్రాయముతో ఏకీభవించజాలను. ఈ పనికొరకు ప్రభుత్వం 25 కోట్ల రూపాయలను కేటాయించింది. దానితో హెచ్చు ధరలకు విదేశీయ ధాన్యాన్ని కొని చవక డిపోలలో అమ్మిస్తోంది. ఇది పెద్ద పొరపాటు. ఈ విధానంవల్ల దేశీయ ధాన్యాల ధరలు పడిపోతున్నాయి. ధరలు పడిపోవుటతోడనే ఉత్పత్తి దెబ్బతింటుంది. దీనివల్ల ధాన్యం వినియోగదార్లకు అపకారం జరుగుతోంది. ధరలు స్థిరంగాను, నమ్మకంగాను నిలబడితే ఉత్పత్తి పెరుగుతుంది. అప్పుడు వినియోగదారునకు సహజముగానే చవక ధాన్యం లభిస్తుంది. కనుక ప్రభుత్వం యివ్వదలచిన ఆహార సహాయకనిధిని, విదేశాలకు పంపించుటకు బదులుగా మనదేశంలోనే ప్రయోజన కరమైన విధంగా ఖర్చుపెట్టవలెనని మనవి చేస్తున్నాను. ఇంతేగాక ప్రభుత్వం కేటాయించిన 25 కోట్ల రూపాయలు ఈపనికి చాలవని నా విశ్వాసము. ఈ మొత్తంకనీసం మూడు రెట్లైనా పెరగాలి.

## ధరలు కంట్రోలు విధానాలు

ధాన్యాల ధరలను పడగొట్టుటకు గాను ప్రభుత్వం ఇటీవల కొన్ని నూతనవిధానాలను అమలులోపెట్టింది.

ఈ కార్యం ప్రణాళికాసంఘంవారి సలహా, సంప్రదింపులతో జరిగినట్లు కనపడుతోంది. ధరలు పడటం, లేవటం సర్వ సాధారణంగా వస్తువుయొక్క సప్లైమీద, దానికి ఉన్నగిరాకీ మీద ఆధారపడిఉంటాయి. ఇది అర్థశాస్త్ర సిద్ధాంతం. సప్లయి పెరిగితే ధర తగ్గుతుంది. కాని ధరలను పడగొట్ట టానికి కొన్ని దుష్టవిధానాలుకూడా ఉన్నాయి. ఆపత్కాల విక్రయాలు అనేవి కొన్ని జరుగుతూఉంటాయి. డబ్బు అవ సరమైతే రైతు వెయ్యిరూపాయిలు విలువచేసే ఎద్దును సగంధరకు విక్రయించేస్తాడు. ఇప్పుడు ప్రభుత్వం అమలులో పెట్టిన విధానంయిదే. ఇది ఒక చెడ్డయెత్తు. బ్యాంకులను ఆహారధాన్యాలపై అప్పుపెట్టవద్దని ఆదేశించింది. దాంతో రైతు, ధాన్యాలవర్తకుడు యిద్దరు డబ్బు యిబ్బందిలో పడ్డారు. డబ్బు అవసరం హెచ్చినకొద్దీ రైతు కక్కుర్తి అమ్మకాలు సాగిస్తున్నాడు. ఇట్టిస్థితిలో ధాన్యాల ధరలు పడి పోవటం సహజం.

ధరలను క్రుంగదీయటానికి ప్రభుత్వం అవలంభించిన విధానానికి మరియొక కారణంకూడా ఉన్నది. బ్యాంకులకు కుదువబెట్టిన ధాన్యాలను ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రొక్యూ రుమెంటు ఏజెంట్లకు తప్ప మరెవ్వరికిని అమ్మరాదని ఆజ్ఞాపిం చారు. ఈ బంధనమునుండి రైతు ఎట్లా తప్పించుకో గలడు?

ప్రభుత్వంచే రైతు మెడకు వేసిన అడకత్తెరకు ఆహార ధాన్యాలపై అప్పు యివ్వగూడదనే విధానం ఒకటి. కుదువ పెట్టిన ధాన్యం ప్రొక్యూరుమెంటు ఏజెంట్లకే అమ్మాలి అన్నది రెండవ కత్తి. ఈ రెండు కత్తులమధ్యా పడ్డాడు రైతు,

ఈ అనుభవాలను పొందిన తరువాత రైతు ప్రభుత్వం పెట్టబోయే 400 గిడ్డంగులను, ధాన్యాన్ని దాచుకోవటానికి సాహసించగలడా? పైవేలు వడ్డీ వ్యాపారస్తుల పంజాలలో నుంచి రైతును ప్రభుత్వం రక్షించగలదా? బ్యాంకీల నుండి రైతునులను ఈ విధంగా బెదర గొట్టడంవల్ల దేశానికే అపకారం జరుగుతుందని ప్రభుత్వానికి అనేక పర్యాయములు నేను హెచ్చరిక చేసినాను.

## నేటి కంట్రోలు ధరలు

గత రెండు సంవత్సరములలోను ఆంధ్ర దేశంలో జరిగిన సంఘటనలు భారతదేశమున గల కర్షక సంఘమునకంతటికిని కనువిప్పును కలిగించగలవు. కేరళ రాష్ట్రమునకును, మద్రాసు, మైసూరు రాష్ట్రములకును లాభము కలిగించ గోరి, ప్రభుత్వం ఆంధ్ర దేశమునకు తీవ్రమైన అపకారం చేసింది. చిరకాలసంపర్కమువలన సుస్థాపితములైన కలకత్తా, బొంబాయి మార్కెట్లకు ఆంధ్ర దేశపు ధాన్యాన్ని రవాణా చెయ్యకుండా నిషేధించింది. ధాన్యాల ధరలను నష్టప్రాయమైన ప్రమాణానికి తగ్గించింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా సంప్రదించలేదు. అంతేగాదు, రాష్ట్ర ప్రభుత్వం ధరలను కొంచెముగానైనను పెంచమని అర్థిస్తే, ఆ ప్రార్థననుకూడా త్రోసివేసింది.

కేంద్రప్రభుత్వం తీసికొన్న ఈ చర్యలవల్ల ఆంధ్ర దేశంలోని రైతులు, ఫ్యాక్టరీ యజమానులు, పెద్ద పెద్ద నష్టాలకు గురి అయ్యారు. విశేషం ఏమంటే, దక్షిణాది బియ్యపు మండలంలో ఆంధ్ర దేశంలోని బియ్యపుధర అతి

హీనస్థాయికి దిగింది. ఇది అన్యాయమని లోకం భావిస్తూ ఉంటే, కేంద్రప్రభుత్వం సగర్వంగా ఈ విషయాన్ని పార్లమెంటులో చాటిచెప్పినారు. ప్రభుత్వం నిర్ణయించిన కోటాలనన్నింటిని యివ్వగా మిగిలిన ధాన్యాన్ని అయినా జోను బయట మార్కెట్టులో అమ్ముకోవటానికి ప్రభుత్వం అంగీకరించలేదు. రైలుపెట్టెల సరఫరా లేకుండా చేసింది. బ్యాంకీ అప్పు లేకుండా చేసింది, చివరికి కుదువపెట్టిన ధాన్యాన్ని ప్రొక్యూరుమెంటు ఏజెంట్లకు మాత్రమే అమ్మవలెనని ఆజ్ఞాపించింది. ఈ ప్రకారంగా రైతు మెడకు చుట్టుకొన్న ఉచ్చునుండి తప్పించుకొనలేక, కదలలేక, మెదలలేక బిత్రబిగిసిపోయినాడు ఈ విధానం సోవియట్ రష్యా విధానాలను మనకందరికీ జ్ఞాపకం జేస్తూంది.

కర్షకులకు వినియోగదారులకు అనుకూలంగాను సుకరంగాను కార్యాన్ని నిర్వహించేందుకు మేము కొన్ని సూచనలు చేశాం. ఒక బియ్యపు నిధిని (Rice pool) ఏర్పాటు చెయ్యమన్నాం. ఆ నిధి తరుగు రాష్ట్రాలకు ఆయా ఋతువులలో అమ్మిన బియ్యపు క్రయధనాన్ని సేకరించి, ప్రొక్యూరుమెంటు ధర పోను మిగిలే పెచ్చును, మిగులు రాష్ట్రంలోని రైతులకు మిల్లు యజమానులకు దామాషా ప్రకారం పంచిపెట్టే అధికారాన్ని యివ్వవలెనని సూచించాము. కాని మా సూచనలను ప్రభుత్వం తృణీకరించింది. తుదకు ఆహారధాన్యాల ధరల నిర్ణాయక సంఘం యిచ్చిన సలహానుకూడా ప్రభుత్వం త్రోసిపుచ్చింది.

ప్రభుత్వ డిపోల ద్వారా ధాన్య సేకరణ

ప్రభుత్వం నూతనంగా ఒక నిర్ణయం చేసింది. ఆ నిర్ణ

యం ప్రకారం ప్రభుత్వం నియమించిన ఏజంట్లు ధాన్యాన్ని, రైతులనుండిగాని, మిల్లులనుండిగాని విక్రయం చేస్తారు. ప్రొక్యూరుమెంటు ధరనుయిస్తారు. ప్రొక్యూరుమెంటు రేటును ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ ధరలు నిర్ణయ సందర్భమున ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వపు సలహానుగాని, రైతు ప్రతినిధుల సలహానుగాని, మిల్లుయజమానుల సలహానుగాని కేంద్రప్రభుత్వం పుచ్చుకొనే సూచనలు కనిపించుటలేదు. ఈప్రకారంగా నిర్ణయమైన ధరలు, ధాన్యసేకరణోద్యోగులు, పూర్వము ప్రజలను వేధించిన "కంట్రోలు విధానాన్ని" మళ్ళా పునరుద్ధరించు ననుటకు సందేహములేదు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య మరల సంఘర్షణలు చెలరేగుననుటకు సందియములేదు. పేదరైతులు తమకు గల స్వల్పధాన్యాన్ని ప్రొక్యూరుమెంటు రేటుకి అమ్ముకుంటే గడవక కక్కురితి పడి దొంగచాటుగా అమ్ముకోవడం జరగవచ్చు. దానితో దొంగబజారు వర్తకుడని నిందకు గురికావటం సంభవించవచ్చు.

ప్రొక్యూరుమెంటు రేటు నిర్ణయించే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వంవారి సలహాను, కర్షకుల ప్రతినిధుల సలహాలను పాటించవలెను. ఇది ప్రస్తుత సమస్య పరిష్కారానికై నేను యిస్తున్న సలహా. ఆహార ధాన్యాల ధరలు స్థిరీకరింపబడవలె నన్న సిద్ధాంతమునకు నా ప్రస్తుత సలహా విరుద్ధముగాదు.

## భూసంస్కరణలు

ప్రస్తుతం ఆంధ్రదేశంలో భూసంస్కరణలను గూర్చిన చర్చలుదావానలంగా చెలరేగుతున్నాయి. ఈవిషయంలో తన

ఆదర్శం ఏమిటో ముందుగా ప్రభుత్వం స్పష్టపరచాలి. భూమి లేని వ్యవసాయదారులకు ఎంతో ఒకింత భూమిని ఇచ్చి, వారికి భూస్వామి హోదాను సమకూర్చుట, స్వయంవృత్తి గలవారిని చేయుట ప్రభుత్వ ధర్మం. అందుకు ఆంధ్రప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న 40 లక్షల ఎకరాల భూమిని పంచడం వివేకవంతమైన పని. ప్రస్తుతం ప్రభుత్వం తలపెట్టిన భూసంస్కరణల చట్టంద్వారా లభించబోయే రెండు, మూడు లక్షల ఎకరాలభూమి కొరకు, ఒక పెద్ద సాంఘికసంక్షోభాన్ని లేవదీయటం మంచిపని కానేరదు.

భూమిసంబంధమైన ఆ పైపై గరిష్ట ప్రమాణాన్ని నిర్ణయించడంవల్ల వ్యవసాయంలో సహజంగా పెట్టుబడి ఆగిపోతుంది. ఉత్తరోత్తర వ్యవసాయ పరిశ్రమకు ఇది గొడ్డలిపెట్టు కాగలదు.

భూస్వామ్యం, భూసేద్యం వేరు వేరు వ్యక్తులచేతుల్లో ఉన్నప్పుడు–సేద్యంచేసేవారికి హెచ్చుప్రతిఫలంముట్టచెప్పాలని ప్రభుత్వం భావిస్తే, అది కౌలుదారీ చట్టంవల్ల నెరవేరుతుంది గానీ సంస్కరణలవల్లకాదు. ఆంధ్రదేశంలో ఇదివరకే కౌలుదారీ చట్టం ఉన్నది. దాన్ని సంస్కరిస్తే ఈ ఆశయం నెరవేరుతుంది. కోర్టు తగాయిదాలు పరిష్కారమౌతాయి.

వ్యవసాయం చేయనివారికి భూమి వుండకూడదని కూడాప్రభుత్వంభావిస్తే–ఆవిషయాన్ని ముందుగా తెలియజేయాలి కౌలుదారులకు భూములు అమ్మివేయాలని హెచ్చరించి – "ల్యాండు ఎక్విజిషన్ ఆక్టు" ప్రకారం అలాంటి భూముల్ని మార్కెటు ధరలకు విక్రయం పొందుటకు అవకాశం కల్పించాలి. అయితే భూములు కలిగినవారిలో సేద్యం చేయలేని

స్థితిలో కొందరుంటారు. విధవలు, తల్లి - దండ్రులులేని బాలురు, అంగవైకల్యం గలవారు, వృద్ధులు మొదలగువారికి ప్రత్యేక సౌకర్యాలు కల్గించాలి.

ఇక ఒకపరిమితికి మించన భూమి యేవ్యక్తిఅధీనంలో ఉండకూడదు అంటే యీ సమస్యా స్వరూపమే మారిపో తుంది. భూసంబంధమైన ఆ స్థిరిమాత్రమే పరిమితి పెట్టడంలో పరమార్థమేమి? తక్కిన ఆస్తులను విడిచిపెట్టడానికి కారణ మేమి? ప్రభుత్వం నియమించిన 'పే కమీషన్ వారు ప్రణా ళికా సంఘ వారు ప్రభుత్వోద్యోగుల జీతాలకు గరిష్ఠప్రమా ణాన్ని నిర్ణయించాలని ఏకగ్రీవంగా శిఫారసు చేశారు. అది ప్రభుత్వానికి చేతిలో పని; అయినా చేయలేదు. ఈ పనిచేసి ప్రభుత్వం మిగతావారి ఆస్తులపైకి వచ్చివున్నట్లయితే ఆద ర్శంగా ఉండేది. అలాంటిదేమీ లేకుండా రైతుల ఆస్తులపై పడుతుంటే ప్రజలు అపార్థం చేసుకోడానికి చాలా అవకాశా లున్నాయి.

అసలు భూమికి గరిష్ట ప్రమాణయు ఉండపలెనా, ఉండనక్కరలేదా, ఉంటే పరిమితి ఎంతై ఉండాలి అన్న విషయాలు భూమి సంస్కరణలకు సంబంధించిన విషయాలు కావు. ఇంత కాలమూ నాయకులు ప్రజలకు బోధించిన భూ సంస్కరణ స్వరూపం వేరు. ఇప్పుడు ప్రభుత్వం తలపెట్టిన భూసంస్కరణ స్వరూపం వేరు. నిజానికిభూసంస్కరణ స్వరూ పాన్ని ఇంత తీవ్రంగా మార్చివేయడానికి ప్రస్తుతం శాసన సభలలో ఉన్న ప్రజాప్రతినిధులకు ప్రజాభిప్రాయముయొక్క అనాకూల్యతవల్ల కలిగే ధికారం ఉన్నదా అనే విషయం సంశయాస్పదమైనదే.

ఈ గరిష్ట శాసనంవల్ల గ్రామీణ ప్రజలకు ఎటువంటి లాభము కలుగదు. ఆహారోత్పత్తి ఏవిధంగాను పెరగజాలదు. ఈ శాసనంవల్ల వ్యవసాయ దారులలో ఏ అంతశ్శాఖకు చెందిన వ్యక్తులకు, ఎట్టి లాభము కలుగజాలదు. ఈశాసనం వల్ల ఎవరికి ఎట్టి లాభము లేకపోగా వ్యవసాయంమాత్రం దెబ్బతినక తప్పదు. వ్యవసాయం ఒక గౌరవనీయమైన వృత్తిగా, తక్కిన వృత్తులతో పోటీచేసి శక్తిని కోల్పోతుంది. వ్యవసాయంలోకి యిక పెట్టుబడి ఎక్కదు. ప్రస్తుతం ఉన్న పెట్టుబడి కూడా, పలాయనం చిత్తగిస్తే చిత్తగించవచ్చు. అప్పుడు దేశానికి గొప్ప ఆపద సంభవించ వచ్చు.

## గరిష్ఠ ప్రమాణానికి కొలతబద్ద ఏది?

భూమి గరిష్ఠ ప్రమాణానికి ఆదాయాన్ని కొలతబద్దగా నిర్ణయించటం ప్రమాదకరం. మన ప్రభుత్వం ఆచరిస్తున్న విధానా వల్ల రూపాయిధర యిదివరకే చాల పడిపోయింది. ముందు ముందు యింకా పడిపోగలదు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కరెన్సీని పెంచుకుంటూ పోతూఉన్నది. ఈ ధోరణిని బట్టిచూస్తే రైతుల ధనరూపమైన ఆదాయం నేటిబీరకాయ చందముగా మారవచ్చు - స్వల్పకాలంలోనే.

అంతేగాక, ఆదాయాన్ని ప్రమాణంగా గ్రహించటం వల్ల తెంపుగా పెట్టుబడిపెట్టి, వ్యవసాయం చేసే కర్షకులకు నష్టం వస్తుంది. పళ్ళ పరిశ్రమ, పట్టుపరిశ్రమ, పుష్ప పరిశ్రమ, శాకపరిశ్రమ, మొదలగు పరిశ్రమలు ఒక్కొక్క ఎకరమునకు కొన్ని వేల రూపాయల పెట్టుబడిని భరించగలవు. ఒక్కొక్క ఎకరము కొన్ని వేల గంటలు మానవశరీర కృషికి అవకాశము చూపించగలవు. ఆదాయమునుకూడ అట్లే, అదే నిష్పత్తిలో

ప్రసాదించగలవు. ఈ విధములగు వ్యవసాయమునకు తెంపు, ఉత్సాహము, నేర్పు, విశేష శాస్త్రజ్ఞానము కల కర్షకులు కావాలి. వారెంత చాకచక్యం చూపినా, ఎంత పెనగులాడినా ఆదాయం మాత్రం అదే ప్రమాణంలోనే ఉంటుంది. ప్రమాణానికి మించితే, తగ్గేదాకా భూమిని గురి చేస్తారుఅంటే, ఆ ప్రజ్ఞావంతుడు ఈవ్యవసాయాన్ని వృత్తిగా పెట్టుకుంటాడా ? వెంటనే మరొక వృత్తి చూచుకుంటాడు. దానికి సెలవు చెప్పుతాడు. కనుక, ఆదాయం కొలతబద్ధగా పెట్టుకొనటం ప్రమాదభూయిష్టమైన చర్య అని మనవి చేస్తున్నాను.

కనుక గరిష్టపరిమాణం 'ఇన్ని పాటిఎకరములు' అని ఉండవలెనని నిర్ణయించుకుంటే సమంజసంగా ఉంటుంది. దీన్నే 'Standard Acres' అంటారు. ఈ విధంగా నిర్ణయింప బడిన గరిష్ఠభూమి యిద్దరు యుక్తవయస్కులగు వ్యక్తులు యిద్దరుపిల్లలుగల కుటుంబమునకు నెలకు రు 500/- చొప్పున లభించుటకు చాలినంతటిదిగా ఉండవలెను.


ఒక రైతుకుటుంబానికి నెలకి రు. 500/- ఆదాయం కావాలి అన్నకోర్కె చాలా సరళమైనకోర్కె. అప డు అతని జీవనప్రమాణం ప్రభుత్వపు కార్ఖానాలలో పనిజేసే పనివాండ్ర జీవనప్రమాణానికి చేరువగా ఉంటుంది. అంతకు మించి ఏమీఉండదు. నేను యిటీవల ప్రభుత్వపు యాజమాన్యంక్రింద నడుస్తూఉన్న కర్మాగారాలను, రక్షణశాఖకు చెందిన కర్మాగారాలను పరిశీలనదృష్టితో చూచివచ్చినాను. పనివాండ్రకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన సౌకర్యాలను, వసతు లను చూచి విస్మితుణ్ణయ్యాను. పరమానంద భరితుణ్ణ

య్యాను. ఆయా పారిశ్రామిక కర్మాగారాలలో పనిజేసే పని వాండ్రి జీవనస్థాయిని అందుకోవటం నెలకు రు 500/- ఆదాయంవచ్చే రైతులకు సాధ్యంగాదు.

ప్రభుత్వం ఒకవిషయాన్ని జ్ఞాపకం పెట్టుకోవాలని కోరుతున్నాను. రైతులు ప్రస్తుతం అధికారంలోఉన్న పార్లమెంటు సభ్యులను, మంత్రులను పరిపూర్ణంగానమ్మి, వారికి ప్రభుత్వాధికారాన్ని అప్పగించారు. కమ్యూనిస్టులు అధికారంలోకివస్తే, రష్యాలో చేసినట్లే రైతులను నాశనంచేసి, కార్మికరాజ్యం స్థాపిస్తారని జడిసి రైతులు కాంగ్రెసును బలపరిచారు. అటువంటి రైతులకు వ్యతిరేకమైనటువంటివిన్నీ, వినాశకరమైనటువంటివిన్నీ శాసనాలనుచేసి, వారిని నాశనం చెయ్యటం విశ్వాస ఘాతుకచర్య అవుతుంది.

శ్రీ రామకృష్ణా, విజయవాడ-2.

# శ్రీ దండమూడి దశరథరామయ్యగారి ఆహ్వాన సంఘ అధ్యక్షోపన్యాసం



మహాశయులారా! నేడు మనకు సుదినం. పెద్దలకృషి ఫలితంగాను, ముఖ్యంగా పొట్టి శ్రీరాములుగారి త్యాగఫలితంగాను, మనచిరకాలవాంఛితమైనఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం ఆంధ్ర రైతాంగం ధాన్యం ఉత్పత్తిదార్ల మహాసభ విజయవాడలో జరుపుకొనుటకు అవకాశం కలిగి యీ రూపంగా మీఅందరి దర్శనభాగ్యం లభించినందులకు సంతోషపడుతున్నాను.

మేము కోరినదే తడవుగా నిరంతర సేవాపరాయణులైన శ్రీ రాజగోపాల నాయుడుగారు మా ఆహ్వానం అంగీకరించి యీ మహాసభకు అధ్యక్షులుగా దయచేసినందులకు హృదయపూర్వక వందనము లర్పించుచున్నాను.

ప్రపంచ రైతు నేత, రైతు ఉద్యమ పితామహుడు, ప్రజాసేవాపరాయణుడు, మన రంగాజీ వారికున్న ప్రత్యేక కార్యక్రమమును మార్చుకొని మా ఆహ్వానం అంగీకరించి

మహాసభకు దయచేసినందులకు ధన్యవాదము లర్పించు చున్నాను.

యిటీవల కనివిని ఎరుగని వరద ప్రమాదములకు గురియైన విశాఖ జిల్లా ప్రాంతాలలో వరద బాధితుల సహాయ కార్యక్రమాలలోనిమగ్నులై యుండికూడామా ఆహ్వానం అంగీకరించి పతాకోత్సవము జరుప దయతో విచ్చేసిన శ్రీ గొర్రెపాటి బుచ్చి అప్పారావు యం. ఎల్. సి. గారికి మా హృదయపూర్వక వందనాలర్పిస్తున్నాను. కోతల తరుణంలో యీ మహాసభకు దూర ప్రాంతాలనుండి మా ఆహ్వానా లందినతోడనే దయచేసిన మీ అందరికి నా హృదయపూర్వక వందనము లర్పించుచున్నాను. ఏనాడు కని విని ఎరుగని వరదవల్ల నష్టపడిన, చనిపోయిన శ్రీకాకుళం, విశాఖ జిల్లాల వరద బాధితుల పట్ల సానుభూతిని తెలుపుచున్నాను.

## మన ఆశయం

గాంధిజీ ఆశీర్వదించి, బలపరచిన రైతుకూలీ ప్రజా రాజ్య నిర్మాణమే మన ఆశయం. రైతులు కూలీలు - కళాకారులు, బుద్ధిజీవులు తమ వృత్తులలో స్వేచ్ఛగా సమాన స్థాయిలో గౌరవం పెంచుకొంటూ, ఆర్థిక సాంఘిక వ్యవహారములలో సమాన ఆదాయ వ్యయములు పొంది సుఖజీవన యాత్ర సాగించుటయే రైతుకూలీ ప్రజారాజ్య గమ్యస్థానం. పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజంలోని లోపాలను అధిగమించి, వ్యక్తిస్వేచ్ఛ, సాంఘిక భద్రత, నిచ్చే యీ నూతన సిద్ధాంతమునకు సృష్టికర్త మన రంగాజీ. యీ సిద్ధాంతమే మన కందరికి రాజబాట.

## రైతుల స్థితిగతులు

దేశమునకు వెన్నెముక రైతు. నేడు అట్టి రైతులు సంఘశక్తి తగినంతగా పెంచుకోలేక అనేక యీతిబాధలకు లోనుకావలసి వస్తున్నది. ఏప్రభుత్వం అధికారంలో నున్నను సర్వప్రజానీకానికి ఆహార ఉత్పత్తి చేయవలసినది రైతులు - వ్యవసాయకూలీలు - వ్యవసాయమునకు సహాయపడేవారు. నేడు వారిపరిస్థితి అధ్వాన్నంగావున్నది. దీనికి కారణం రైతులు సంఘ శక్తి తగినంతగా పెంచుకోకపోవటమే అయి ఉన్నది. రాష్ట్రజనాభాలో 100కి 80 మంది వ్యవసాయంమీాద, ఎవరి అధికారమునకు లోబడకుండా స్వతంత్రంగా జీవనం చేస్తున్నారు. అయినా ప్రభుత్వం రైతుల పట్ల నిరాదరణతో వ్యవహరిస్తున్నది.

## ఆంధ్రప్రదేశ్

విస్తీర్ణంలో 106041 చదరపుమైళ్లుఉండి 3,12,60,188 జనాభాగల్గి 20 జిల్లాలు, 183 తాలూకాలలో 293 పట్టణాలు 26450 గ్రామాలు గల పెద్దరాష్ట్రము మన ఆంధ్రప్రదేశ్.

మొత్తం రాష్ట్రంలో పంటల క్రింద సేద్యం చేయబడుచున్న విస్తీర్ణం 2,93 8100 ఎకరాలు మాత్రమే అయివున్నది. యిందులో 66 లక్షల 8 వేల ఎకరాలు **మాత్రం** నీటి పారుదలవల్ల పంట పండించబడుతూ మిగతా భాగమంతయు మెట్టపంటలు పండించు భాగంగావున్నది. అరణ్యప్రదేశంగా 1. 40,26,000 ఎకరాలు వున్నది.

యీ సంవత్సర పరిస్థితులను బట్టి వరిపంట ఉత్పత్తి యావత్తు రాష్ట్రంలో సంతృప్తికరంగా ఉన్నదని భావించ

వచ్చును. మెట్టప్రాంతములలో అతివృష్టివల్ల కొంతభాగం, అనావృష్టివల్ల కొంతభాగం దెబ్బతిని, వ్యవసాయం గిట్టుంపు కాని పరిస్థితులు ఏర్పడినవి.

## అధిక ఆహార ఉత్పత్తి - ధరలు

అశోకమెహతా కమిటీ రిపోర్టు నాధారం చేసుకొని గతసంవత్సరం కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టదాయకమైన ధరలు నిర్ణయించింది. గడచిన రెండు సంవత్సరములలోను; పంట తగ్గిపోవుటచేతను, గిట్టుబాటైనధరల ప్రభుత్వం యివ్వక పోవుటవల్ల రైతాంగం చాలా నష్టపడవలసి వచ్చింది. ఈ సంవత్సం ఒకనెల వర్షాలు వెనుక పడటంతో, సాగులన్నియు ఒకేసారి చేయవలసిన పరిస్థితులు ఏర్పడినందున, మామూలు కూలీఖర్చు కంటె మూడురెట్లు హెచ్చువ్యయంతో నాట్లు పూర్తి చేయవలసి వచ్చింది. నారుమళ్లు దెబ్బతినడంవల్ల అధిక ధరలతో ఎరువులు ఖరీదుచేయటంవల్ల చాలా వ్యయం పెరిగినది. యింతవ్యయంతో సాగించిన కృషికిపంట తరుణం వచ్చింది గాన యీ సంవత్సరమైనను గిట్టుబాటైన ధర నిర్ణయించవలసిందిగా ప్రభుత్వమును, కోరవలసి యున్నది.

మనరాష్ట్రంలో డెల్టాసాగులు, చెరువులు, నూతులు, వాగులు, సోనల క్రింద సాగు చేయుచున్న ప్రాంతాలలో ఆయా రైతులకున్న యిబ్బందులు తెలుసుకొని వారి సమస్యల పరిష్కార మార్గం ఆలోచించవలసి యున్నది.

మన దేశంలో నిమిషానికి 14 మంది జననం పెరుగుచున్నట్లు లెక్కలు వల్ల తెలియుచున్నది. జనాభా పెరిగినకొలది ఆహార సమస్య తీవ్రమవుచున్నది.

ప్రభుత్వంవారు కోట్ల రూపాయలు ఖర్చుచేసి కొత్త ప్రాజెక్టులు, మైనరు, మేజరు యిరిగేషన్ వసతుల నభివృద్ధి చేస్తున్నారు. కాని తగినంతగా అభివృద్ధిని పొందలేకపోతున్నాం. దీనికికారణం రైతులవద్ద పెట్టుబడిశక్తి లేకపోవడం, ప్రభుత్వం రైతులకు తగిన పరపతి సౌకర్యాలు కలిగించలేకపోవడం అయి ఉన్నది.

రైతు ఎప్పుడు అధికం పండించాలనే తాపత్రయంతోనే ఉంటాడు. కాని రైతుకు యివ్వవలసిన ప్రోత్సాహం లభించనందువల్ల, యితరదేశాలలోని రైతులతోపాటు పంట పండించలేక పోతున్నాడు. ఉదాహరణగా తుంగభద్ర ప్రాజెక్టు క్రింద ఎంత ఖర్చుచేసినారు, ఎంత సాగవుచున్నదీ వివరాలు పరిశీలించిన తెలియగలదు. రైతుల కివ్వవలసిన శాస్త్రజ్ఞానం, సకాలంలో నీటివసతి, పరపతి, లోపంగా ఉన్నది.

## శిస్తులభారం

ఒక వైపున రైతు పండించే పంటకు ధరలు తగ్గించుతూ, మరొకవైపున రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులపై అధిక శిస్తులభారం మోపడం చాలా అన్యాయం, అభివృద్ధి నిరోధక పంథా అయి ఉన్నది నీటి తీరువా పెంపుదల, సర్చార్జీలు, సెటిల్మెంటు లెవీ, భూమి శిస్తు పెంపుదల, రీ సెటిల్మెంటు సర్చార్జీలు వగయిరా అధిక శిస్తులు రైతులపై వేసింది. యీ శిస్తుభారాన్ని తగ్గించుకోవడంగాని, ఆదాయం పెంచుకోవలసిన అవసరంగాని కలదు. యిప్పటికే శిస్తుల భారం పెరిగి రైతు క్రుంగిపోతుంటే యింకా రైతులపై

శిస్తుభారం పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలో చిస్తున్నవి. అధిక శిస్తులను ఎదిరించేటందుకు రైతులు సంఘ టిత పడాలి.

## వ్య వ సా య కూ లీ లు

వ్యవసాయమునకు మూలాధారమైన వ్యవసాయ కూలీలుస్థితిగతులు మరీఅధ్వాన్నంగాఉన్నవి. వ్యవసాయకూలీ లకు కనీస కూలీ రేట్లను నిర్ణయించాలి. యీ కనీస కూలి కనీసజీవితానికి కొంతైనా అవకాశమివ్వాలి. వ్యవసాయ వస్తు వులధరలలో హెచ్చు తగ్గుల క్రమాన్ననుసరించిన దినకూలీ హెచ్చుతూ, తగ్గుతూ, వుండాలి. దినకూలీ మాత్రం ధాన్య రూపంలో ఉండాలి. దున్నే ఎద్దు, వ్యవసాయకూలీ, రైతు, పాలేళ్ళు బలంగా వుంటేనే వ్యవసాయం సాగి అధిక పంట పండించుటకు అవకాశం వుంటుంది.

## నీటివనర్లు - మురుగు సౌకర్యాలు

మన రాష్ట్రంలో లక్షలాది చెరువుల క్రింద వరిపంట పండించబడుచున్నది. కాని చెరువుల మరమ్మతులు తృప్తి కరంగాలేవు. డెల్టా ఏరియాలో కూడా నీటివనర్లతో పాటు మురుగు సౌకర్యాలు సరిగాలేవు. పెద్దపెద్ద నదులతో పాటు, చిన్ననదులు, పెద్ద మురుగు కాల్వలను, కేంద్ర వరద నిరో ధక కమిటీ లిస్టులో చేర్చి కేంద్రం నుండి గ్రాంటు ప్రతిసంవ త్సరం పొంది మరమ్మతులు చేయించవలసి యున్నది. ఇందు వల్ల ప్రతిసంవత్సరం ముసురు దెబ్బలవల్ల పంట నష్టం కాకుండ రక్షణ ఏర్పడగలదు.

## భూ సం స్క ర ణ లు

మన రాష్ట్రంలోగూడ ప్రభుత్వం భూసంస్కరణలు బిల్లు ప్రకటించింది. వ్యవసాయేతర వర్గాల, వృత్తుల ఆదాయంమీదగూడ గరిష్ట పరిమితులు నిర్ణయించకుండా కేవలం వ్యవసాయ రైతులపై భూసంస్కరణలు తీసికొని వచ్చుట చాలా అన్యాయం. కేంద్ర ప్రభుత్వం యీ పాక్షిక వైఖరిని రైతులంతా సంఘటితపడి యెదిరించవలసి యున్నది.

## స హ కా ర వ్య వ సా యం

కేంద్రప్రభుత్వం ప్లానింగ్ కమిటీవారు సహకార వ్యవసాయం దేశం మొత్తంమీద తీసికొని రావాలని నిర్ణయించినారు. యితర దేశాలలో విఫలమైన యీ విధానం మన దేశానికి వలదని రైతు సంస్థలు, నాయకులు ఆందోళన చేయుచున్నారు. అధికాహారోత్పత్తికొరకు రైతుస్వామ్యం నిలబెట్టుటకు సహకార వ్యవసాయ పద్ధతిని మనం వ్యతిరేకించవలసి యున్నది.

సమష్టి వ్యవసాయమునకు నాందిగా మాత్రమే సహకార వ్యవసాయమంటూ యున్నారు. కాని, ఈ పద్ధతులను తీవ్రముగా యెదిరించకపోతే రైతు స్వామ్యమునకే ముప్పు తప్పదు.

## ఆహార ధాన్యాలు - క్రయవిక్రయం

వ్యాపారుల సహకారంతో ఆహార ధాన్యాల టోకు వ్యాపారం ప్రభుత్వమే సాగించాలని నెహ్రూగారు, కేంద్ర ప్రభుత్వం ఒక నిశ్చయానికి వచ్చి కొన్ని రాష్ట్రములలో లైసెన్సుల పద్ధతి అమలు జరుపుతున్నారు. దీనిపర్యవసానం

ఏ విధంగా వుంటుంది అనేది సభవారు చర్చించవలసి ఉన్నది. ఇంకా పూర్తి వివరాలు ప్రకటింపబడలేదు. తిరిగి కంట్రోలు పరిస్థితులు రాకుండ, రైతుల స్వేచ్ఛకు భంగం కలుగకుండ, గిట్టుబాటుధర రైతులు పొందుటకు, ఖరీదు దారులకు, వినియోగదారులకు న్యాయంగా ఉండే విధానం కొరకు మనం ఆలోచించ వలసి యున్నది.

యీ సమస్యలేగాక, అనేక సమస్యలున్నవి. వీటిని సాకల్యంగా చర్చించి ఒక నిర్ణయానికి వచ్చి ప్రభుత్వంవారికి నివేదించుకొనుకే మీ అందరిని యిచటి సమావేశ పరచడ మైనది. అనేక శ్రమలకోర్చి దూరప్రాంతముల నుండి మా ఆహ్వానం అంగీకరించి దయచేసిన మీకందరికి ఆహ్వాన సంఘం తరపున మరొకమారు హృదయపూర్వక అభివందనము లర్పించుచున్నాను.

యీ మహాసభను జరుపుటకు కృష్ణాజిల్లా కిసాన్ సమ్మేళన్ వారు, కోరినంత అవకాశంయిచ్చిన ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ వారికి ఈ హాలులో సభను జరుపుటకు అడిగినదే తడవుగా వారికి నష్టమైనను, అనుమతి నిచ్చి తోడ్పడిన విజయా టాకీసువారికి మా కృతజ్ఞతను తెలియపర్చుచున్నాము.

ఆహ్వాన సంఘంవారికి ఈ మహాసభ వ్యయమునకై ఉదుతాభక్తిగా నిధులు సమర్పించి తోడ్పడిన దాతలకు మీ అందరితరపున వందనా లర్పించుచూ సెలవుతీసుకొంటున్నాను.